క్లుప్తంగా

నేడు మంత్రి రోజా పర్యటన

నగరి: నియోజకవర్గంలో బుధవారం నిర్వహించే పలు కార్యక్రమాల్లో మంత్రి ఆర్‌కే రోజా పాల్గొననున్నారు. ఉదయం 8 గంటలకు నగరి మున్సిపాలిటీ కాకవేడు ఆదిఆంధ్రవాడలో నిర్వహించే మాతమ్మ ఆలయ కుంభాభిషేక వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం విజయపురం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. సాయంత్రం 4 గంటలకు తిరుపతి గ్రాండ్ రిడ్జ్‌లో నిర్వహించే ఆడదాం ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారు.

వైభవంగా ద్రౌపదీదేవి కల్యాణం


పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు

నిండ్ర: మండలంలోని అత్తూరు గ్రామంలో ద్రౌపదీదేవి సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో ద్రౌపదీదేవి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. కల్యాణోత్సవం అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు.

మండల మీట్ రేపు

విజయపురం: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొనాలని ఆయన కోరారు.

సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రమణ్యస్వామి

కార్వేటినగరం: స్కంధ పుష్కరిణి సమీపంలోని కుమారగిరిపై వెలసిన వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్య స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం వల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు ఆలయ అధ్యక్షుడు కేశవరెడ్డి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తేలికపాటి వర్షం

విజయపురం: మండలవ్యాప్తంగా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తేలికపాటి వర్షం పడింది. ఎండ తీవ్రతకు పొడిబారిన వ్యవసాయ భూములు ఈ వర్షంతో కొంత తడిచాయి. దీంతో రైతులు పొలాలను దుక్కులు చేయడానికి సులభతరమైంది. ఇప్పటికే కొంతమంది రైతులు ఖరీఫ్ ప్రారంభం కావడంతో పొలాలను దుక్కులు చేసి చదును చేస్తున్నారు. మరి కొంతమంది వరి నాట్లకు అడుసు వేస్తున్నారు. తాజాగా కురిసిన వర్షం రైతులకు కొంత ఊరట ఇచ్చింది.

పర్యాటక కేంద్రంగా వినాయకసాగర్

తిరుపతి తుడా: వినాయకసాగర్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తేనున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషన్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి తెలిపారు. సాగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. పనులను శరవేగంగా పూర్తిచేయాలని గుత్తేదారులను ఆదేశించారు. మున్సిపల్ ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ విజయ్‌కుమార్ రెడ్డి, కార్పొరేటర్లు ఆదం రాధాకృష్ణారెడ్డి, బోకం అనిల్ కుమార్ పాల్గొన్నారు.

రూ.5లక్షల వైఎస్సార్ బీమా చెక్కు పంపిణీ


చెక్కును అందజేస్తున్న అధికారులు

సత్యవేడు: మండలంలోని ఏఎం పురంలో పిడుగుపడి మృతి చెందిన చెందిన ఎం.బాలకృష్ణయ్య భార్య ఎం.మునెమ్మకు వైఎస్సార్ బీమా కింద రూ.5లక్షల చెక్కును ఎంపీడీఓ చంద్రశేఖర్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కే.సుశీల్‌కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి అందజేశారు. మంగళవారం నిర్వహించిన ప్రభుత్వ కార్యక్రమంలో మృతుడి కుటుంబానికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సంగీత, ఎంపీటీసీ శరవణన్, పార్టీ నాయకుడు కనకరాజు, డిప్యూటీ తహసీల్దార్ రవి చంద్ర పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆదరించండి


మంత్రి రోజాతో కలిసి జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు


అల్లూరి జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

- హైదరాబాద్‌ను, సెల్‌ఫోన్‌ను కనిపెట్టిన చంద్రబాబు.. అమ్మఒడి, ఆసరా, చేయూత పథకాలను ఎందుకు కనిపెట్టలేదు ?
- చంద్రబాబు, పవన్‌ను నమ్మవద్దు
- పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా

పుత్తూరు రూరల్: ఢిల్లీలో చక్రం తిప్పానని, హైదరాబాద్, కంప్యూటర్, సెల్‌ఫోన్లను తానే కనిపెట్టానని చెప్పుకుంటున్న చంద్రబాబు అమ్మఒడి, చేయూత, ఆసరా, సురక్ష పథకాలను ఎందుకు కనిపెట్టలేక పోయారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడాశాఖా మంత్రి ఆర్‌కే రోజా ప్రశ్నించారు. మంగళవారం పుత్తూరు రూరల్ మండలం రామకృష్ణాపురం సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ చంద్రబాబు ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన ఎప్పుడైనా చేశారా అంటూ ప్రశ్నించారు. ఇక్కడ ఓ చోటా నాయకుడు సెల్ఫీ తీసి అభివృద్ధి జరగలేదంటూ మాట్లాడడం జరిగిందన్నారు. ఒక్క రామకృష్ణాపురం సచివాలయ పరిధిలోని లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటి వరకు రూ.11.50 కోట్లను అందించడం జరిగిందని వివరించారు. రూ.70 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బోర్లు వంటి అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. రూ.54 లక్షలతో జగనన్న ఇళ్లు కట్టించడం జరిగిందన్నారు. ఒకే సచివాలయంలో ఇంత అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అంది ఉంటే ఏమీ జరగలేదంటూ టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ గాలి మాటలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్న విషయాన్ని టీడీపీ వారు గుర్తించాలన్నారు. జగనన్న సురక్ష ఒక అద్భుత కార్యక్రమని అభివర్ణించారు. అర్హత ఉండి, వివిధ సేవలు, పథకాల లబ్ధి పొందడంలో విఫలమైన వారిని గుర్తించి, వారికి లబ్ధి చేకూర్చడమే ఈ పథకం లక్ష్యమని వివరించారు. మీ కోసం ఇంత మంచి చేస్తున్న జగనన్నను, ఆయన సైనికులైన మమ్మల్ని ఆదరించాలని కోరారు. ప్రజలకు ఏనాడు మంచి చేయని చంద్రబాబు, అతని వంత పాడుతున్న పవన్‌కల్యాణ్‌ను నమ్మవద్దని చెప్పారు. అనంతరం సురక్ష లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేసి, సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సుమతి, ఎంపీడీఓ ఇందిర, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, సర్పంచులు విరిత, మురళీయాదవ్, గోవిందస్వామిరెడ్డి, ఎంఎల్‌ఓ దిలీప్‌మొదలి, నాయకులు మురళిరాజు, దేవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి అల్లూరి

పుత్తూరు రూరల్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో నేటి యువతరం పదిమందికి సహాయపడాలని మంత్రి ఆర్‌కే రోజా పిలుపునిచ్చారు. మంగళవారం పుత్తూరు పట్టణంలో క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో అల్లూరి 126వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా అల్లూరి విగ్రహానికి మంత్రి రోజా గజమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అల్లూరి ఆశయ సాధన దిశగా నేటి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈరోజు చిత్తూరు జిల్లా వాసులకు ఎంతో సంతోషకరమైన రోజని అన్నారు. చంద్రబాబు తన సొంత సంస్థ అయిన హెరిటేజ్ కోసం చిత్తూరు డెయిరీని మూసివేసిన దుర్మార్గుడని అన్నారు. కానీ సీఎం జగనన్న మాత్రం ఇచ్చిన మాట ప్రకారం ఈరోజు అమూల్ సంస్థ ద్వారా రూ.385 కోట్ల పెట్టుబడితో తిరిగి పునరుద్ధరణతో పాడి రైతు కుటుంబాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. జగనన్న పాల వెల్లువ పథకం ద్వారా పాల ధరను సైతం పెంచి ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో క్షత్రియ సంఘ నేతలు డాక్టర్ ఎస్.కృష్ణమరాజు, ఎం.సురేష్‌రాజు, ఎస్‌కేపీ బాబు, ఎం.వెంకట్రామరాజు, శేఖర్‌రాజు, మురళిరాజు, రమేష్‌రాజు, కిరణ్, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బూచివనత్తంలో నేడు జగనన్న సురక్ష

విజయపురం: మండలంలోని బూచివానత్తం గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయ పరిధిలో జరిగే ఈ కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు. గ్రామస్థాయిలో సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని సూచించారు.

సంక్షేమ సారథికి తీపి గుర్తుగా..


సీఎం జగన్‌కు చాక్లెట్ ఇస్తున్న మంత్రి ఆర్కే రోజా

నగరి: జిల్లాకే తలమానికమైన చిత్తూరు విజయా డెయిరీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పాడి రైతుల కోసం చిత్తూరు విజయా డెయిరీకి పూర్వవైభవం తెస్తానని సీఎం జగన్ భరోసా ఇచ్చి తీపికబురు అందించారు. ఈ సందర్భంగా ఆయనకు పర్యాటక శాఖ మంత్రి ఆర్కేరోజా చాక్లెట్‌ను తీపిగుర్తుగా అందించి ధన్యవాదాలు తెలిపారు.

చాతుర్మాస పూజలు ప్రారంభం


మాట్లాడుతున్న విద్యా స్వరూపానందగిరిస్వామి

శ్రీకాళహస్తి: పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో మంగళవారం చాతుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. ఈ పూజలను ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపనందగిరిస్వామి ప్రారంభించారు. నెల రోజుల పూజల్లో భాగంగా తొలిరోజు ఉదయం 6 నుంచి 7గంటల వరకు యోగా గురువు మార్కండేయులు ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ, అనంతరం భగవద్గీత పారాయణం నిర్వహించారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఉపనిషత్తులపై సర్వాత్మనందస్వామిజీ ప్రవచనం, 11 నుంచి 12గంటల వరకు భగవద్గీత పారాయణం, సాయంత్రం భగవద్గీతపై ఆశ్రమ పీఠాధిపతి ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా బోధనలు


విద్యార్థినితో మాట్లాడుతున్న కార్వేటినగరం ఎంఈఓ మనోజ్‌కుమార్

కార్వేటినగరం: విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా బోధనలు చేపట్టాలని మండల విద్యాశాఖ అధికారి–2 మనోజ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలో గొల్లకండ్రిగ, కొటార్వేడు, ఒంటిలవారిపల్లి గ్రామాల ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదేవిధంగా కొటార్వేడు హెచ్‌డబ్ల్యూలో అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంతా కూడా బడిఈడు పిల్లలు బడిలో ఉండే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి, ప్రతి విద్యార్థి కూడా ప్రభుత్వ స్కూళ్లలో విద్యనభ్యసించే విధంగా చూడాలని తెలిపారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని సూచించారు. అనంతరం ఆయన పాఠశాల రికార్డులతో పాటు, విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట


మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం: ప్రతి ఒక్కరూ శారీరకంగా, మానసికంగా మంచి ఆరోగ్యంతో ఉండడం వల్ల అనేక రకాల జబ్బుల నుంచి రక్షించుకోగలమని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన పాలసముద్రం పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. గ్రామీణ ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వారు సమతుల ఆహారం తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. నిత్యం యోగా, వాకింగ్ వంటివి చేయడం వల్ల మానసిక ప్రశాంతత దొరుకుతుందని తెలియజేయాలని సూచించారు. ప్రతిరోజు పండ్లు, కూరగాయలు, చిరు ధాన్యాలు (రాగులు, సజ్జలు, కొర్రలు, అనుములు) తినడం ద్వారా వల్లే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. అలాగే 45 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఆర్నెళ్లకు ఒకసారి బీపీ, షుగర్ చెక్ చేసుకునేలా గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సుశీల, మురళి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అభిమాన నాయకుడిని చూడాలని..


బస్సులో బయలుదేరుతున్న ప్రజలు


బస్సులో బయలుదేరుతున్న ప్రజలు

పాలసముద్రం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్, వైస్ ఎంపీపీ శేఖర్ తెలిపారు. మంగళవారం పాలసముద్రంలో మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి చిత్తూరులో జరిగిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేవలం జన్మభూమి కమిటీలు ఎంపిక చేసిన వారికి మాత్రమే సంక్షేమ పథకాలు అందేవన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం జగనన్న ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారన్నారు. 20 ఏళ్ల కిందట మూతపడిన చిత్తూరు విజయా డెయిరీని మళ్లీ ఇన్నేళ్ల తరువాత సీఎం జగనన్న ప్రారంభించడం జిల్లా పాడి రైతులకు శుభసూచకమన్నారు. అనంతరం చిత్తూరుకు 14 బస్సుల్లో వారు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో సర్పంచులు భాస్కర్‌రెడ్డి, గాలి మహేష్ బాబు, లిల్లీ, అనురేఖ, శీభ, జీవిత, నరసింహరాజు, వైస్ ఎంపీపీ పుష్ప, ఎంపీటీసీలు గోవిందరాజు, లిఖిత, నాయకులు సుబ్రమణ్యం రెడ్డి, రవిరెడ్డి, షణ్ముగంరెడ్డి, అరుల్, ఆనందన్, ప్రకాష్, డ్వాక్రా సంఘాల సభ్యులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్తూరు జిల్లా కేంద్రంలోని అమూల్ డెయిరీ శంకుస్థాపన కార్యక్రమానికి మండలంలోని గ్రామాల నుంచి తండోపతండాలుగా స్వచ్ఛందంగా ప్రజలు బస్సులు, ద్విచక్రవాహనాలు, ఆటోల్లో వెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ 20 ఏళ్ల కిందట చంద్రబాబు తన హెరిటేజ్ కంపెనీ లాభాల కోసం లక్షలాది మంది రైతులను, వేలాదిమంది కార్మికుల పొట్టకొట్టారని ఆరోపించారు. అలాంటిది నేడు చిత్తూరు డెయిరీ తరపున చెల్లించాల్సిన రూ.182 కోట్లు అప్పును తీర్చి మళ్లీ జీవం పోసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ ద్వారా ప్రత్యక్షంగా 5 వేలమందికి, పరోక్షంగా 2 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కల్పిస్తున్నారని అన్నారు.

ప్రజలకు తోడుగా సంక్షేమ ప్రభుత్వం

- ఇప్పటికీ సంక్షేమ పథకాలు అందకుంటే చెప్పండి
- వలంటీర్ల దృష్టికి తీసుకొస్తే చాలు పథకాలు అందిస్తాం
- జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు



నగరి: సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ, నిండ్రలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

నగరి: రాష్ట్రప్రజలకు జగనన్న సురక్ష రక్షణగా నిలుస్తుందని ఎంపీపీ భార్గవి అన్నారు. మంగళవారం మండలంలోని బుగ్గ అగ్రహారం గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. లబ్ధిదారులకు 86 ఇంటగ్రేటెడ్ సర్టిఫికెట్లు, 102 మందికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 9 మందికి బర్త్ సర్టిఫికెట్లు, మ్యుటేషన్, టైటిల్‌డీడ్ పట్టాపాసుపుస్తకం ఒకరికి, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ ఇద్దరికి, ఆధార్ సేవలు 20 మందికి, విభజించిన రేషన్ కార్డులు ఇద్దరికి, ఇలా 222 సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలకు కనీవినీ ఎరుగని రీతిలో ప్రభుత్వం సేవలు అందిస్తోందన్నారు. ఎంపీడీఓ లీలామాధవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, సర్పంచ్‌లు రవి, చంద్రకళ, ఎంపీటీసీ జ్యోతి, కోఆప్షన్ మెంబర్ దస్తగిరి, మండల సచివాలయ కన్వీనర్ హరి, సచివాల కన్వీనర్లు సత్య, మస్తాన్, నాయకులు భాస్కర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నిండ్రలో..

నిండ్ర: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందించడానికి జగనన్న సురక్ష పథకం ఉద్దేశమని ఎంపీపీ దీప అన్నారు. మంగళవారం మండలంలోని ఆరూరు సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు సచివాలయాల్లో 11 రకాల సేవలు, అన్నిరకాల ధ్రువపత్రాలు అందించడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా పలువురికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణ, నాయకులు వేణురాజు, హౌసింగ్ ఏఈ శ్రీధర్‌రాజు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సత్వర సేవలు


మాట్లాడుతున్న అధికారులు

శ్రీరంగరాజపురం: జగనన్న సురక్ష కార్యక్రమం సత్వర సేవలు పొందవచ్చని మండల ప్రత్యేక అధికారి సుబ్రమణ్యం అన్నారు. మండలంలోని కటికపల్లి సర్పంచ్ మార్కొండయ్య అధ్యక్షతన సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వాటర్‌షెడ్ చైర్మన్ గుణశేఖర్ నాయుడు, తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఎంపీడీఓ కృష్ణయ్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి జయంతి


అల్లూరి సీతారామరాజు వేషధారణలో విద్యార్థులు

నగరి: మండలంలోని నంబాకం మండల పరిషత్ పాఠశాలలో మంగళవారం విప్లవ వీరుడు, తెలుగు తల్లి ముద్దుబిడ్డ అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అల్లూరి సీతారామరాజు వేషధారణలో ఏకపాత్రాభినయం చేస్తూ అలరించారు. విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు బహుమతులను అందించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయండి


రైతుల అభిప్రాయాలను తెలుసుకుంటున్న శ్రీనివాసులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలో జరుగుతున్న వంద అడుగుల క్లస్టర్ రహదారి కోసం భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని భూసేకరణ అధికారి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లు, రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గుమ్మడిగుంట, పొయ్య, గౌడమాల రైతులను నుంచి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గౌడమాల, పొయ్య గుమ్మడిగుంట గ్రామాల పరిసరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే కొన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసిన విషయం ఆయన గుర్తు చేశారు. పరిశ్రమల అవసరాల రీత్యా రవాణా కోసం ఈ ప్రాంతంలో వంద అడుగుల క్లస్టర్ రహదారి నిర్మించాలని ఏపీఐఐసీ నిర్ణయించిందన్నారు. ఇందుకోసం రైతుల నుంచి భూమి సేకరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం రైతులకు పరిహారం ఇస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎర్రంరెడ్డి సుధీర్‌రెడ్డి, వీఆర్వోలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతకు ప్రత్యేక శ్రద్ధ

- డీఎస్పీ శ్రీనివాసరావు


డీఎస్పీ శ్రీనివాసరావు

పుత్తూరు రూరల్: విద్యార్థుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పుత్తూరు డీఎస్పీ వై.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రైవేటు స్కూళ్లు, కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రతి విద్యార్థి ఇంటి నుంచి బయలుదేరినప్పటి నుంచి తిరిగి ఇళ్లు చేరేంత వరకు బాధ్యత తీసుకోవాల్సి ఉందన్నారు. స్కూల్ బస్సులు, వ్యాన్ల నిర్వహణలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. లేనిపక్షంలో తగిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. బస్సులు, వ్యానుల ఫిట్‌నెస్‌లను ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలని సూచించారు. వాహనంలో డ్రైవర్‌తో పాటు అటెండర్ ఒకరు విధిగా ఉండాలని చెప్పారు. డ్రైవర్లు మద్యం తాగి అతివేగంగా వాహనాలను నడపడం జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు పట్టణంలోని ప్రైవేటు విద్యాసంస్థల యాజమానులతో సమావేశమై వివరించినట్లు తెలిపారు.

ధైర్యంగా సమాచారం ఇవ్వండి..

కళాశాలలకు వెళ్లి వచ్చే దారిలో విద్యార్థినులకు ఏమైనా సమస్యలు ఉంటే 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఫిర్యాదు ఇచ్చే వారి పేర్లు, అడ్రస్సులు గోప్యంగా ఉంచుతామన్నారు. మీ ఇళ్ల వద్దకు వచ్చే మహిళా పోలీసు కార్యదర్శులకు మీ సమస్యలను తెలియజేయాలని సూచించారు. మీరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చే అవసరం లేకుండానే మీ సమస్య పరిష్కారం అవుతాయన్నారు. మహిళల భద్రతే లక్ష్యంగా ప్రభుత్వం ఎప్పటికప్పుడు తగిన చర్యలు చేపడుతోందన్నారు. అందుకు అనుగుణంగా మహిళలు సహకరిస్తే నేరాలను అదుపు చేయడం సులభతరం అవుతుందని తెలిపారు.

నేడు అల్లూరి విగ్రహావిష్కరణ

విజయపురం: మండలకేంద్రంలోని విజయపురం బస్టాండు ఆవరణలో బుధవారం మంత్రి ఆర్‌కే రోజా చేతుల మీదుగా అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని స్థానిక నాయకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు ర్యాలీ, 10.30 గంటలకు విగ్రహావిష్కరణ, 11 గంటలకు సాంస్కృతిక కార్యక్రమం, 12 గంటలకు భోజనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయనగరం ఎమ్మెల్సీ పీవీవీ సూర్యనారాయణరాజు, అల్లూరు సీతారామరాజు మనవడు అల్లూరు శ్రీరామరాజు పాల్గొంటారని తెలిపారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో అంతా పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు.

చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలు శిక్ష

తిరుపతి లీగల్: చెక్‌బౌన్స్ కేసులో తిరుపతి భవానీనగర్‌కు చెందిన బి.గోపినాథ్‌రెడ్డికి ఏడాది జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి బి.వాణిశ్రీ మంగళవారం తీర్పు చెప్పారు. ఫిర్యాది తరపు న్యాయవాది ఎంఎస్.మణి తెలిపిన కేసులోని వివరాల మేరకు తిరుపతి భవానీనగర్‌కు చెందిన కె.ప్రసాద్ అనే వ్యక్తి వద్ద గోపినాథ్‌రెడ్డి తన అవసరాల కోసం 2018 ఏప్రిల్‌లో రూ.3లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ సొమ్మును చెల్లించే క్రమంలో గోపినాథ్‌రెడ్డి అదే ఏడాది జూన్‌లో ఓ చెక్‌ను ప్రసాద్‌కు ఇచ్చాడు. ఆ చెక్ బ్యాంకులో బౌన్స్ అయింది. దీంతో అతను కోర్టులో గోపినాథ్‌రెడ్డిపై చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశాడు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి గోపినాథ్‌రెడ్డికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.